



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

ఓటరు జాబితాను సరిచేయాలి

- 1500 ఓటర్లు దాటితే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

మహబూబాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షేత్రస్థాయిలో ఓటరు జాబితా ప్రకారం.. ఇంటింటికి వెళ్లి మృతి చెందిన వారిపేర్లు తొలగించి, అడ్రస్ మార్పు, ఆన్‌లైన్‌లో వచ్చిన ఫామ్స్‌పై విచారణ చేసి ఐటీ టూల్స్ ద్వారా ఓటరు జాబితాను సరిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో జరుగుతున్న ఓటరు నమోదు, ఇంటింటి సర్వే, పోలింగ్‌స్టేషన్ నిర్వహణ ఏర్పాటు, స్వీప్ యాక్టివిటీస్, ఓటరు జాబితాలో చేర్పులు మార్పుల పరిశీలన, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1500 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి, మరొకటి ఏర్పాటు చేయాలన్నారు. ఓటరు జాబితాలో చేర్పులుమార్పులను బీఎల్‌వోలు యాప్‌ను ఉపయోగించి, పూర్తి ఆన్‌లైన్‌లో మాత్రమే సరిచేయాలన్నారు. ఒకే కుటుంబానికి సంబంధించిన ఓటర్లు ఒకే పోలింగ్‌కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ప్రహరీ, తదితర సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లలో చైతన్యం కల్పించేందుకు స్వీప్ కార్యక్రమాల ద్వారా విద్యాసంస్థలు, బస్టాండ్‌లు, రద్దీ ప్రదేశాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈవీఎం గోదాంలను తనిఖీ చేసి, సీసీ కెమెరాలు,పరిసరాలను పరిశీలించాలన్నారు.అనంతరం మానుకోట పట్టణంలో లెనిన్‌నగర్, ఎన్జీవోస్ కాలనీ, ఇందిరానగర్ కాలనీ, కంకరబోడ్, రాంచంద్రాపురం, గుమ్ముడూరులో జరుగుతున్న ఇంటింటి ఓటరు జాబితాను పరిశీలించి బీఎల్‌వోలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఓటరు జాబితా, స్వీప్ కార్యక్రమాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఆర్డీవోలు అలివేలు, నరసింహరావు, తహసీల్దార్లు పవన్‌కుమార్, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశాన్ని పాలిస్తున్న గాడ్సే వారసులు

మహాత్మాగాంధీని చంపిన గాడ్సే వారసులు నేడు దేశాన్ని పరిపాలిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. త్యాగాల కుటుంబానికి చెందిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై ఎన్‌డీఏ నేతలు ఉగ్రవాదుల్లా అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఈ మేరకు హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి నిరసన, ధర్నాలో ఆయన పాల్గొన్నారు. బీజేపీ, దాని మిత్రపక్షాల నేతలు చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా వైఖరేమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై ఇప్పటి వరకు కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. అంటే.. ఈ వ్యాఖ్యలను వారు సమర్థిస్తున్నట్లేనా..? అని అన్నారు. రాహుల్‌గాంధీ త్యాగాల కుటుంబానికి చెందిన వారన్నారు. ఆయనను కాపాడుకుంటామని పేర్కొన్నారు. అనంతరం ఎన్‌డీఏ నేతల దిష్టిబొమ్మలను దహనం చేశారు.

- హనుమకొండ సిటీ



హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లో జరిగిన నిరసన సభలో మాట్లాడుతున్న మహేశ్‌కుమార్‌గౌడ్, పాల్గొన్న మంత్రి పొన్నం, ఎంపీ, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు

- రాహుల్‌గాంధీపై ఉగ్రవాదుల్లా బీజేపీ, ఎన్‌డీఏ నేతల వ్యాఖ్యలు
- వారిపై మోదీ, అమిత్‌షా కేసులు పెట్టాలి
- రాహుల్ కుటుంబానిది త్యాగాల చరిత్ర
- ఆ కుటుంబ చరిత్రను కనుమరుగు చేసే కుట్ర
- రాహుల్ దేశ భవిష్యత్తు.. ఆయనను కాపాడుకుంటాం..
- టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్
- హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లో బీజేపీ నేతల దిష్టిబొమ్మల దహనం

వివరాలు 7లో..

మోదీ.. రాహుల్‌కు క్షమాపణ చెప్పాలి

- గాడ్సే వారసత్వ లక్షణాలున్న పార్టీ బీజేపీ
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క ధ్వజం
- మానుకోటలో నిరసన కార్యక్రమానికి హాజరు



మహబూబాబాద్ ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీతక్క

మహబూబాబాద్, సెప్టెంబరు18 : (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో ప్రజల కోసం కొట్లాడే ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ నాలుక కోస్తా అని మాట్లాడడం బీజేపీ నేతల దురంహకార ఆలోచనకు నిదర్శనమని, దీనికి నైతిక బాధ్యతవహిస్తూ ప్రధాని మోదీ తమ నేత రాహుల్‌గాంధీకి క్షమాపణ చెప్పాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీపై బీజేపీ ఢిల్లీ మాజీ ఎమ్మెల్యే తర్వీందర్‌సింగ్, మహారాష్ట్ర షిండే వర్గం శివసేన ఎమ్మెల్యే సంజయ్‌గైక్వాడ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం కాంగ్రెస్ నేతలు మానుకోట పట్టణంలో ఆందోళన నిర్వహించారు. తొలుత డీసీసీ భవన్ నుంచి గాంధీ పార్కు వరకు ర్యాలీ నిర్వహించి.. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నెహ్రూసెంటర్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గాంధీ వారసత్వం పుణికిపుచ్చుకున్నదని, కానీ.. బీజేపీ మాత్రం దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మాగాంధీని చంపిన గాడ్సే వారసత్వ లక్షణాలను కలిగి ఉన్న పార్టీ అని ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ వాస్తవాలు మాట్లాడుతుంటే తట్టుకోలేని బీజేపీ నేతలు ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, అందుకు ప్రధాని మోదీ బాధ్యత వహించాలన్నారు. ఇక సచివాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం నెలకొల్పితే బీఆర్‌ఎస్‌ఎందుకు రాద్ధాంతం చేస్తోందో అర్థం కావడం లేదని, త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో దేశాభ్యున్నతికి ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్షలను గుర్తించి తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది సోనియమ్మ కాదా అని ప్రశ్నించిన సీతక్క.. తెలంగాణలో ఐదు పదవులు తీసుకుని, నిరంకుశ పాలన సాగించిఫామ్ హౌసల గురించి ఆలోచించే మాజీ సీఎం కేసీఆర్ కుటుంబానికి రాజీవ్‌గాంధీ గురించి గూర్చి మాట్లాడేనైతిక హక్కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, గుగులోతు దస్రునాయక్, ఘనపురపు అంజయ్య, నూనావత్ రాధ, చుక్కల ఉదయ్‌చందర్, మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, అంబటి మహేందర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, రాంరెడ్డి, నీరుటి లక్ష్మీనారాయణ, బండారు వెంకన్న, రాజుగౌడ్, ఎడ్ల రమేష్, సతీష్, ప్రభాకర్, ఎండీ హరుణ్, అల్లం నాగేశ్వర్ రావు, నారోజు సత్యమనోరమ, విజయలక్ష్మి, పోతురాజు రాజు, సమ్మయ్య, బి.రాజు, నాళ్ల లక్ష్మీనరసింహరావు పాల్గొన్నారు.

భయం.. భయం

కుక్కలు, కోతుల దాడులతో ప్రజలు బెంబేలు



తొర్రూరు సమీపంలో రోడ్డు వెంట గుంపులుగా ఉన్న కుక్కలు



జిల్లా కేంద్రం శివారు కాలనీలో గుంపులుగా ఉన్న కోతులు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 18 : జిల్లాలో కుక్కలు, కోతులు స్వైరవిహారం చేస్తున్నాయి. వాటిని చూసి ప్రజలు వణికిపోతున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడా చూసినా గుంపులు గుంపులుగా తిరుగుతూ.. జనంపై దాడులు చేస్తున్నాయి. వానరాలు (కోతులు), గ్రామసింహాల (కుక్కలు)ను చూస్తే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. చిన్నారులను నుంచి మొదలుకుని వృద్ధుల వరకు ఇటు కోతులు.. అటు కుక్కలు గాయ పరిచిన సంఘటనలు నిత్యం ఏదో ఓ చోట జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల కుక్కలు ఓ బాలున్ని పొట్టనపెట్టుకున్న ఘటన లేకపోలేదు.

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మడిపెల్లి గ్రామంలో కొన్నిరోజుల క్రితం బాలుడిని కుక్క గాయపరిచి పొట్టన బెట్టుకున్నాయి. కోతులు కూడా చేతిలో సంచి పట్టుకుని వెళితే వెంటపడి లాక్కుంటున్నాయి. తిరగబడితే గాయపరుస్తున్నాయి. ఊర్లలోనే కాదు.. రైల్వేస్టేషన్‌లలో ప్లాట్ పామ్‌లపై తిరుగుతూ ప్రయాణికులను భయకంపితులను చేస్తున్నాయి. ఈ సమస్య ఏ ఒక్క పల్లెనో లేక ఒక పట్టణానిదో కాదు.! యావత్ తెలంగాణ రాష్ట్ర సమస్యగా పరిగణించాల్సిందే. దీనిని సామాజిక, భద్రత సమస్యగా పరిగణించాలని, రాష్ట్రవ్యాప్తంగా కుక్కలు.. కోతులను నియంత్రించాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఏకంగా శాసనమండలిలో చర్చ పెట్టారు. అంతే కాకుండా స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ కూడా రాశారు. ఇప్పటికైనా పాలకులు వాటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అడవులు అంతరించడంతోనే..

రోజురోజుకు అడవులు అంతరించి పోవడంతో కోతులు వాటిని వదిలి పల్లెల బాటపట్టాయి. అనేక ఏళ్ల నుంచి కోతులు గ్రామాలు సంచరిస్తున్నప్పటికి ఇంతటి విధ్వంసకర చర్యలు లేవు. గతంలో కాస్త అడవుల్లో పండ్లు, ఫలాలు దొరకడంతో ఎక్కువగా గ్రామాల్లో కన్పించేవి కావు. ఇప్పుడు పూర్తిగా గ్రామాల్లోనే కోతులు సంచరిస్తున్నాయి. సరియైన ఆహారం దొరక్క ఇంట్లో చొరపడి వస్తువులను ధ్వంసం చేస్తూ తినుబండరాలను ఎత్తుకుపోతున్నాయి. వాటిపై తిరగబడితే గుంపులుగుంపులుగా ఉన్న కోతులు మనుషులను గాయపరుస్తున్నాయి. ఇక ఊరికి దగ్గరలో ఉన్న పంటపొలాలు ఒక్కటి కూడా దక్కడం లేదు. రైతులు వేసిన వ్యవసాయ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. కోతుల బెడదను తట్టుకోలేక కేసముద్రం మండలం కల్వలలో రైతు సుధాకర్ కొండముచ్చును కొనుగోలు చేసి ప్రతీరోజు పంటపొలాల దగ్గర కాపాల కాసి పంటను రక్షించుకున్న సంఘటనలు ఉన్నాయి. ఇటు పంటలు, అటు ఇంట్లో వస్తువులను ధ్వంసం చేయడంతో కోతులతో ప్రజలు, అన్నదాతలు విసిగి వేసారి పోతున్నారు. ఇక జిల్లాలోని రైల్వేస్టేషన్ల ప్లాట్‌పామ్‌లపై సంచరిస్తూ ప్రయాణికుల చేతుల్లో సంచులను లాక్కుని వారిని భయాందోళనకు గురి చేస్తున్నాయి.



- గాయపరుస్తుండటంతో వణుకుతున్న జనం
- వ్యవసాయ పంటలు, ఇంట్లో వస్తువుల ధ్వంసం
- చిన్నారులను పొట్టన పెట్టుకుంటున్న శునకాలు
- జిల్లాలో ఐదు నెలల్లో 653 కుక్కకాటు కేసులు



మడిపెల్లిలో కుక్క దాడిలో చనిపోయిన బాలుడు (ఫైల్)

ఐదు నెలల్లో కేసులు ఇలా..

మహబూబాబాద్ జిల్లాలో ఐదునెలల కాలంలోనే 653 కుక్క కాటు కేసులు నమోదయ్యాయంటే అవి ప్రజలను ఏవిధంగా గాయపరుస్తున్నాయో అర్థమవుతుంది. ఏప్రిల్ మాసంలో 148, మేలో 143, జూన్‌లో 119, జూలైలో 127, ఆగస్టులో 116 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. ఇటీవల కాలంలో ఏ పేపర్ చూసినా.. ఏ టీవీ వీక్షించినా కుక్కల దాడుల్లో చిన్నారులు, ప్రజలు గాయపడ్డ వార్తలే వినాల్సి వచ్చింది. కుక్కల దాడుల్లో గాయపడ్డ సంఘటనలు పెరిగిపోయాయి. కుక్కలు కూడా ఎన్నడు లేనివిధంగా గ్రామాల్లో చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రజలను విపరీతంగా గాయపరుస్తున్నాయి. ఉదయం వేళల్లో పిల్లలు బడికి వెళ్లాలన్న, వీధుల్లోకి వెళ్లాలన్న కుక్కల భయంతో వణికిపోతున్నారంటే అతిశయోక్తి కాదు.

మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు మండలం మడిపెల్లి గ్రామంలో ఇంటి ముందు పడుకోబెట్టిన గత కొన్నిరోజుల క్రితం బాలుడిని కుక్క గాయపరిస్తే చనిపోయిన హృదయవిదారకర ఘటన చోటు చేసుకుంది. బయ్యారం మండలం గంధంపల్లిలో తండ్రి కొడుకులను తీవ్రంగా గాయపరిచాయి. ఇదే మండలంలోని వినోబానగర్‌లో కుక్కల దాడిలో 12 మూగ జీవాలు (మేకలు, గొర్రెలు) మృతి చెందగా మరో 10 గాయపడ్డాయి.

నివారించాలని సీఎంకు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి లేఖ..

రాష్ట్రంలో కోతులు, కుక్కల బారి నుంచి ప్రజల ప్రాణాలను కాపాడాలని శాసనమండలి సభ్యుడు (ఎమ్మెల్సీ) తక్కెళ్లపల్లి రవీందర్‌రావు శాసనమండలిలో చర్చ పెట్టి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. కుక్కలు, కోతుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని గతనెల 26న రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డికి లేఖను కూడా రాశారు. ఇది ఒక్కగ్రామం, పట్టణం సమస్యకాదని యావత్ తెలంగాణ రాష్ట్ర సమస్యగా గుర్తించాలని లేఖలో వివరించారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి నివారణ చర్యలు చేపట్టి ప్రజలకు రక్షణగా నిలవాలని అందులో పేర్కొన్నారు.

కుక్కలను నియంత్రించాలి..

ధర్మారపు సుజాత, తొర్రూరు మండలం, వెంకటాపురం గ్రామం



గ్రామాల్లో కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో సంచరిస్తున్న కుక్కలను తరలించాల్సిన అధికారులు ఒక్కరోజు కూడా రావడం లేదు. గ్రామాల్లో చిన్నారులు, పెద్దలపై కుక్కలతో పాటు కోతులు దాడులు చేస్తున్నా కన్నెత్తి చూడటం లేదు. గతంలో బాలుడు మృతి చెందడంతో కుక్కలను తరలిస్తామని హడావిడి చేసి వదిలేశారు. అధికారులు తక్షణమే గ్రామాల్లో కుక్కలను నియంత్రించడంతో పాటు దూరప్రాంతాలకు తరలించాలి.

లౌకిక శక్తులు బలోపేతం కావాలి

- మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడే సత్తా కమ్యూనిస్టులకే ఉంది
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సూర్నపు సావిత్రమ్మ సంతాపసభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు18 : రాజ్యాంగాన్ని రద్దు చేస్తామన్న మతోన్మాద కుట్రలను తిప్పికొట్టాడానికి లౌకికశక్తులు బలోపేతం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. దేశంలో ప్రధాని మోదీ పాలనలో మతోన్మాదం పెరిగిపోతుందని, దానికి వ్యతిరేకంగా పోరాడే సత్తా కమ్యూనిస్టులకే ఉందని వెల్లడించారు. మహబూబాబాద్ ఆర్తి గార్డెన్స్‌లో బుధవారం సీపీఎం మునిసిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య సతీమణి ఐద్వా పట్టణాధ్యక్షురాలు సావిత్రమ్మ సంతాప సభను నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రజా, మహిళా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనే ఐద్వా నాయకురాలు సావిత్రమ్మ మృతి ఉద్యమాలకు తీరనిలోటని, వారి ఆశయ సాధన కోసం పాటు పడాలని కోరారు.

ప్రజా ఉద్యమాల్లో సావిత్రమ్మ ముఖ్యభూమిక..
- మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్

జిల్లాలోని ప్రజాఉద్యమాల్లో ఐద్వా నాయకురాలు సావిత్రమ్మ ముఖ్యభూమిక పోషించారని, ఆమె ఆకస్మిక మృతి చాలా బాధాకరమని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. తన గెలుపులో కమ్యూనిస్టులు ముఖ్యభూమిక పోషించారని తెలిపారు. సావిత్రమ్మ కుటుంబానికి తామంతా అండగా నిలుస్తామన్నారు.

ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ పేదల పక్షపాతి సావిత్రమ్మ అంతిమయాత్ర, సంతాపసభకు వేలాది మంది తరలి రావడం చూస్తుంటే వారి సహాయ గుణం అర్థమవుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సుంకరి వీరయ్య, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, బండి పుల్లయ్య మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకన్న, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య పాలడుగు భాస్కర్, తప్పెట్ల సైలాబ్‌బాబు, నున్న రాజ్యలక్ష్మి, మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు, గునిగంటి రాజన్న, అల్వాల వీరన్న, శెట్టి వెంకన్న, వివిధ పార్టీల నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ఘనపురపు అంజయ్య, చుక్కల ఉదయ్ చందర్, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు,భూక్య ఉమా, జగ్గన్న, మండల వెంకన, ఎడ్ల రమేష్, చిట్యాల జనార్దన్, డోలి సత్యనారాయణ, పిల్లి సుధాకర్,ఎమ్డీ. ఫరీద్, యాకన్న పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో లయన్స్ ముందంజ

ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఎఫ్ గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి



రావిరాల వరద బాధితులకు నిత్యావసరాలు అందజేయడానికి విచ్చేసిన వెంకట్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 18 : ప్రపంచ వ్యాప్తంగా ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడు ముందువరుసలో నిలుస్తుందని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఎఫ్ గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదలకు నష్టపోయిన 400 మంది బాధిత కుటుంబాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రూ.10 లక్షల విలువ గల వస్తువులను (బియ్యం, నిత్యావసర సరుకులు, వంటపాత్రలు, దుస్తులు) అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.2500 విలువ గల వస్తువులను అందించారు. జిల్లాలోని నెల్లికుదురు మండలం రావిరాలలో 150, మహబూబాబాద్ పట్టణంలో 100, సీరోలు మండలం మోదుగు గడ్డతండాలో 50, దుబ్బతండాలో 50, మరిపెడ మండలం బాలినిధర్మారంలో 50 మొత్తంగా 400 కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లను అందించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసి ప్రజలు తీవ్రంగా నష్టపోయారని వారికి లయన్స్ క్లబ్ రూ.10లక్షల విలువైన వస్తువులను అందించి చేయూత నందించిందని చెప్పారు. విపత్కర సమయాల్లో ఎక్కడ నష్టం జరిగితే అక్కడ లయన్స్ క్లబ్ ఉంటుందని ఆయన వివరించారు. వరద బాధితులకు సహాయం చేయడానికి ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని కోరారు. మహబూబాబాద్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఆయా కార్యక్రమాల్లో వీడీజీ-1 చంద్రశేఖర్ ఆర్య, వీడీజీ-2 ఎస్.సుధాకర్‌రెడ్డి, క్యాబినెట్ సభ్యులు హరికిషన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, సుభాష్, అనుమాల వెంకటేశ్వర్లు, డాక్టర్ నాగవాణి, రీజనల్ చైర్మన్ రామసహాయం వెంకట్‌రెడ్డి, జోన్ చైర్మన్ రావుల రవిచందర్‌రెడ్డి, రేగూరి శ్రీదేవి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, కొండపల్లి కేశవరావు, పీవీ.ప్రసాద్, మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, చాడ అశోక్‌రెడ్డి, అనుమాల సిద్ధార్థ, లక్ష్మీనర్సింహారావు, శారద, తుమ్మూరి వెంకట్‌రెడ్డి, ఎం.వాణి, శైలజ, ఉమా, పర్కాల రవీందర్‌రెడ్డి, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'స్వచ్ఛ మానుకోటగా తీర్చిదిద్దుదాం'

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 18 : పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛ మానుకోటగా తీర్చిదిద్దుదామని మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్ అన్నారు. స్వచ్ఛతా హి సేవా 2024 కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ మునిసిపల్ పరిధి హనుమాన్ బజారులో బుధవారం చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛ మానుకోటకు అందరూ కృషి చేయాలని సూచించారు. మేనేజర్ శ్రీధర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ కరుణాకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ క్రాంతి పాల్గొన్నారు.



గూడూరులో పెద్దల పండుగను నిర్వహిసున్న ఆదివాసీలు

ఘనంగా ఆదివాసీల పెద్దల పండుగ

గూడూరు, సెప్టెంబరు 18 : మండల కేంద్రంలో బుధవారం ఆది వాసీలు పెద్దల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ మాసంలో ఉత్తర కార్తె మొదటి బుధవారం ఈ పండుగను తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ గూడాల్లో జరుపుకుంటారు. ఆదివాసీలకు అతిపెద్ద జాతర అయినా మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర తర్వాత రెండో ఆదివాసీ కొయ్యల పెద్దల పండుగ రోజున కులపెద్దలంతా ప్రకృతి దేవతలను పూజించారు. పూర్వీకులను స్మరించుకుంటూ మొక్కులు చెల్లించుకుంటారు. కొత్తగా వివాహమైన నవదంపతులు కులపెద్దల సమక్షంలో పరిచయ వేదిక కార్యక్రమాలను కూడా చేపడతారు. ఈ కార్యక్రమంలో కులపెద్దలు పొడుగు కృష్ణమూర్తి, చాపల నాగయ్య, దారం స్వామి, ఐలబోయిన వీరయ్య, వాసం భద్రయ్య, పూనెం సమ్మ య్య, పెనక వెంకన్న, మోకాళ్ల వెంకన్న, చేపల లక్ష్మీనర్సు, ముయ్య బోయిన వెంకన్న, పెనక ప్రభాకర్, బత్తుల శ్రీనివాస్, పాక నర్సయ్య, పొనక ప్రశాంత్, అల్లం శ్రీను, కార్తీక్, సందీప్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు సుందర్‌రాజ్ గుడ్ బై?

- కాంగ్రెస్ లేదా బీజేపీలో చేరే అవకాశం
- ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి పార్టీకి దూరం



రాంనగర్, సెప్టెంబరు 18: కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉం టున్న మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రా జ్ కారు దిగేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. సుందర్‌రాజ్‌తో అధికార పార్టీ కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో తన శ్రేయోభిలాషులతో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఏపార్టీలోకి వెళ్లినా సముచితస్థానం ఉంటుందనే హామీ లభించినట్లు తెలిసింది.

కాగా, 2001 నుంచి బీఆర్ఎస్‌లో పనిచేస్తున్న సుందర్ రాజ్.. 2015, 2021, 2024లో జరిగిన శాసనమండలి ఎన్నికల్లో గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ టికెట్ ఆశించారు. పార్టీ అధిష్ఠానం సుందర్‌రాజ్‌కు ఇవ్వకుండా దాటవేస్తూ వచ్చింది. అధి ష్ఠానం నిర్ణయానికి కట్టుబడిన సుందర్‌రాజ్.. పార్టీ ఇచ్చిన కార్యకలాపాలను విజయవంతం చేశారు. ప్రతీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాస్టర్జీ కళాశాలల అధినేతగా, ప్రైవేటు కళాశాలల సంఘం రాష్ట్ర నేతగా యాజమాన్యాలతో సమావేశాలు ఏర్పాటు చేసి గ్రాడ్యుయేట్స్‌ను ఏకతాటిపై తీసుకువచ్చి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపులో తనదైన పాత్ర పోషించాడు. ఈ క్రమంలో సుందర్‌రాజ్‌కు బీఆర్ఎస్ అధిష్ఠానం 2022 ఏప్రిల్ 4వ తేదీన కుడా చైర్మన్‌గా అవకాశం కల్పించింది. అయితే ఆయన ఈ పదవిలో కనీసం యేడాది కూడా ఉండ లేదు. కిందటేడు నవంబర్‌లో జరిగినఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కుడా చైర్మన్ పదవి నుంచి వైదొలగాల్సి వచ్చింది. 8 నెలలు మాత్రమే కుడా చైర్మన్‌గా పదవిలో సుందర్‌రాజ్ ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో..

కుడా చైర్మన్ పదవి కోల్పోయిన క్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్‌ను సుందర్‌రాజ్ ఆశించారు. అయితే బీజేపీని వీడి బీఆర్ఎస్‌లోకి వచ్చిన రాకేష్‌రెడ్డికి అధిష్ఠానం టికెట్ ఇచ్చింది. రాకేష్‌రెడ్డిని తీసుకురావడంలో బీఆర్ఎస్‌కు చెందిన ఒక ఎమ్మెల్యే కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. తనకు అవకాశం ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన సుందర్‌రాజ్.. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో అమెరికా వెళ్లారు. తిరిగి వచ్చి ఐదు మాసాలుగా పార్టీ కార్య కలాపాలకు దూరంగా ఉంటున్నారు. నూతనంగా బీసీ సం ఘాన్ని ఏర్పాటు చేసి సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నా రు. పార్టీకి దూరమైన సుందర్‌రాజ్‌ను పార్టీ నేతలు పలకరించిన పాపాన పోలేదని తెలిసింది. ప్రతీ పార్టీ కార్యక్ర మంలో కీలక పాత్ర పోషించే ఆయన.. దూరంగా ఉండటం పట్ల స్థానిక నేతలు సైతం స్పందించలేదని సమాచారం. అటు అధిష్ఠానం, ఇటు స్థానిక నేతలు పట్టించుకోకపోవ డంతో సుందర్‌రాజ్ పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. సుందర్‌రాజ్ బీఆర్ఎస్ వీడితే పట్టబద్రులు దూరమయ్యే అవకాశం ఉందని శ్రేణులు చర్చించుకుంటున్నారు.

వర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబుపై వేటుకు రంగం సిద్ధం!

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: కాకతీయ యూనివర్సిటీ భూ కబ్జాల ఆరోపణల నేపథ్యంలో తొలుత సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబుపై వేటు పడనున్నట్లు తెలిసింది. వర్సిటీ భూ కబ్జాల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి జాయింట్ ఇన్‌స్పెక్షన్ బృందం అధికారులు చేసిన సిఫార్సుల మేరకు కఠిన చర్యలకు రంగం సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. వర్సిటీలోని 229 సర్వే నెంబర్‌లో అశోక్‌బాబుతోపాటు మరికొందరు అక్రమంగా ఇళ్లు నిర్మించడమే కాకుండా కబ్జాలకు పాల్పడినట్లు తాజాగా తేలిదిఇ. సర్వేల ఆధారంగా వర్సిటీ 229 సర్వేనెంబర్‌లో భూకబ్జాలపై స్పష్టత రావడంతో జిల్లా రెవెన్యూ అధికారులు రాష్ట్రప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు తెలిసింది. రెవెన్యూ, విజిలెన్స్ అధికారుల సర్వే రిపోర్టుల ఆధారంగా ఏఆర్ పి.అశోక్‌బాబుపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని వర్సిటీలో జోరుగా చర్చ నడుస్తోంది. దీనిపై త్వరలోనే అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశమున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

కాగా, వర్సిటీలో టీచింగ్, నాన్ టీచింగ్ విభాగంలో ఏఆర్‌గా పనిచేసిన కాలంలో ఏఆర్ అశోక్‌బాబు వర్సిటీ పాలక మండలిలో, వర్సిటీ భూ కమిటీలో సభ్యుడిగా, కన్వీనర్‌గా పనిచేశారు. అయితే అశోక్‌బాబు పాలక మండలిలో, భూకమిటీ నుంచి తొలగించాలని పాలక మండలి సభ్యులు, రాష్ట్ర ఉన్నతాధికారులు కోరినప్పటికీ అప్పటి వీసీ టి.రమేశ్ తొలగించకుండా కొనసాగించారు. విద్యార్థిసంఘాల ఆందోళనలు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూకమిటీని నుంచి చివరకు అశోక్‌బాబును తొలగించాల్సి వచ్చింది. అయితే ఆ సమయంలో అశోక్‌బాబుపై చాలా అరోపణలు వచ్చాయి. అనుకూలమైనవారికి వర్సిటీలో అత్యున్నత పదవులు కట్టబెట్టబెట్టడంలో సహకరించారని, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల పట్ల సరిగా వ్యవరించేవారు కాదనే ఆరోపణలున్నాయి. తనకు వత్తాసు పలికిన వారికి పార్టుటైమ్ ఉద్యోగాలు కట్టబెట్టినట్లు తెలిసింది. అలాగే వర్సిటీలో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

దేశాన్ని పాలిస్తున్న గాడ్సే వారసులు!

● ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై ఉగ్రవాదుల్లా బీజేపీ, ఎన్డీఏ నేతల వ్యాఖ్యలు ● వారిపై మోదీ, అమిత్‌షా కేసులు పెట్టాలి
● టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ ● హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లో బీజేపీ నేతల దిష్టిబొమ్మల దహనం


అంబేద్కర్ జంక్షన్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, పక్కన ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 18: భారతదేశాన్ని గాడ్సే వారసులు పాలిస్తున్నారని, ప్రజాస్వామ్య విలువలను పాతిపెడుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీపై బీజేపీ, ఆ పార్టీ మిత్రపక్షాల నేతలు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్‌లో రాహుల్‌గాంధీపై బీజేపీ, ఎన్‌డీఏ నేతలు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ధర్నా, నిరసన సభ జరిగింది. బీజేపీ మంత్రి రవనీత్‌సింగ్ బిట్టు, శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌ల దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. అనంతరం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభను ఉద్దేశించి మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు.

బీజేపీకి చెందిన రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్, శివసేన పార్టీ ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్, యూపీ మంత్రి రఘురాజ్‌సింగ్, బీజేపీ నాయకుడు దర్విందర్ సింగ్‌లు తీవ్రవాదుల్లా మాట్లాడారని మండిపడ్డారు. బాధ్యతగల ప్రజాప్రతినిధులై ఉండి మరో ప్రజాప్రతినిధి అయిన రాహుల్‌గాంధీపై అప్రజాస్వామికంగా, తీవ్రవాదుల్లా వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు పునరుద్ఘాటించారు. బీజేపీ, దాని మిత్రపక్షాల నేతల వ్యాఖ్యలపై ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే స్పందించాలని, ఆ నలుగురి వ్యాఖ్యలను సమర్థిస్తున్నారా? లేక వ్యతిరేకిస్తున్నారా? తేలాల్సి ఉందన్నారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం, గౌరవం ఉంటే.. ప్రధానమంత్రి ఆ నలుగురిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే అప్రజాస్వామికులను గౌరవిస్తున్నట్లు భావించాల్సి ఉంటుందని మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

రాహుల్‌గాంధీ కుటుంబానికి త్యాగాల చరిత్ర

రాహుల్‌గాంధీ కుటుంబానికి త్యాగాల చరిత్ర అని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. మోతీలాల్ నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వరకు దేశం కోసం త్యాగాలు చేశారని, జైలుకు వెళ్లారన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణాలే అర్పించారన్నారు. ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని దేశ ఐక్యత, అభివృద్ధి కోసం తపిస్తున్న రాహుల్‌గాంధీని ఒకరు టెర్రరిస్టు అని, మరొకరు ఆయన నాలుక కోస్తే వాళ్లకు రూ.11లక్షల బహుమానం ఇస్తామని, ఇంకొకరు రాహుల్‌గాంధీకి వాళ్ల నాయనమ్మకు పట్టిన గతే పడుతుంది.. అంటూ భయానక వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజలంతా ఖండిస్తున్నారన్నారు. అయినా మోదీ, అమిత్‌షాలు మాత్రం నోరు మెదపడం లేదని విరుచుకుపడ్డారు. జమ్మూ కశ్మీర్, మహారాష్ట్రల్లో బీజేపీ, శివసేన కనుమరుగు కానుందని, రానున్నరోజుల్లో హరియానాలో కాంగ్రెస్ అధికారంలోకి రానుందని, దీనిని జీర్ణించుకోలేని బీజేపీ.. రాహుల్‌గాంధీపై అప్రజాస్వామిక వ్యాఖ్యలు చేస్తూ బెదిరింపులకు గురిచేస్తోందని ఆరోపించారు. రాహుల్.. ఆయన కుటుంబ చరిత్రను కనుమరుగు చేయాలనే కుట్రలు బీజేపీ పన్నుతోందన్నారు. రాహుల్‌కు ఏమైనా హాని జరిగితే బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. రాహుల్‌గాంధీ దేశ ప్రజల భవిష్యత్తు అని, ఆయనను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. బీజేపీ నేతల వ్యాఖ్యలపై బీఆర్ఎస్ మౌనంగా ఉందని, బీజేపీతో ఆ పార్టీ లోపాయికారి ఒప్పందమే ఇందుకు నిదర్శనమని మహేశ్‌కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. దేశంలో కుల, మత వైషమ్యాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలనే బీజేపీకి ప్రజలే మరింత గుణపాఠం చెబుతారన్నారు. మోదీ, అమిత్‌షాలకు చిత్తశుద్ధి ఉంటే ఇకనైనా ఆ నలుగురిపై కేసులు నమోదు చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రాహుల్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్పందించాలి

రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆ నలుగురిపై బీజేపీ అధిష్ఠాన వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని, ముఖ్యంగా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు స్పందించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. బీజేపీ అడుగులకు మడుగులు ఒత్తే బీఆర్ఎస్ నేతలు కిమ్మనడం లేదని దుయ్యబట్టారు. ప్రధాన మంత్రి మోదీ, ఆయన తల్లిపై వ్యాఖ్యలు చేయాలనుకుంటే తాము చేయలేమా?.. అది సంస్కారం కాదని మంత్రి పొన్నం వ్యాఖ్యానించారు.

గాంధీ కుటుంబం కాలి గోటికి సరిపోరు

బీజేపీ నేతలు రాహుల్‌గాంధీ కుటుంబం కాలి గోటికి సరిపోరని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ త్యాగాలు ముందు బీజేపీ నేతలెంత? అని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ సారయ్య, మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు,


ప్రసంగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య


పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి


ప్రసంగిస్తున్న భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు


ప్రసంగిస్తున్న మేయర్ గుండు సుధారాణి


మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ

వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీపై ఈగ వాలినా ఊరుకోమని హెచ్చరించారు. దేశంలో వైషమ్యాలు, ద్వేషాలు సమసి అన్నివర్గాల ప్రజలు సుఖః సంతోషాలతో విలసిల్లాని, దేశం అభివృద్ధి చెందుతూ ఐక్యంగా ఉండాలని రాహుల్‌గాంధీ కోరుకుంటుంటే.. బీజేపీ నేతలు ప్రజాస్వామ్య విలువలను పాతర పెట్టేలా వ్యవహరిస్తున్నారని విరుచుకుపడ్డారు. రాహుల్‌గాంధీ రాజకీయ ఉన్నతిని జీర్ణించుకోలేకే బీజేపీ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసాచారి, ఆనంద్ మోజెస్, జీడబ్ల్యూఎంసీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్ రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా, టీపీసీసీ నాయకులు శ్రీనివాసాచారి, కూచన రవళి, ఎం.డి. అంకూస్, మార్క విజయ్, ఆనంద్ మోజెస్, డాక్టర్ శ్రవణ్, వీసం సురేందర్‌రెడ్డి, నాయిని లక్ష్మారెడ్డి, రజాలీ, బుచ్చిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊకల్ నాగేంద్రస్వామి, భద్రకాళి సన్నిధిలో..

వరంగల్ కల్చరల్ / గీసుగొండ, సెప్టెంబరు 18: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బొమ్మగాని మహేశ్‌కుమార్ గౌడ్ బుధవారం తొలిసారి వరంగల్ పర్యటనకొచ్చారు. తొలుత ఆయన గీసుగొండ మండలం ఊకల్ గ్రామంలోని శ్రీబాల నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే 40 రోజులుగా విజయ పాశుపత పారాయణం జపించిన ఆయన రక్ష కంకణాన్ని స్వామి వారికి తిరిగి చెల్లించారు. ఈ సందర్భంగా సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు మహేశ్‌కుమార్ గౌడ్‌కు తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. నెమలి పింఛాలమాలతో సత్కరించారు.

అనంతరం వరంగల్‌లోని చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయానికి చేరుకున్న మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ఈవో శేషు భారతి అయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అక్కడ వల్లభగణపతిని దర్శించుకున్న తర్వాత భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ఆలయ మహా మండపంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, పుల్లా పద్మావతి తదితరులకు అర్చకులు శేషు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈవో శేషు భారతి అమ్మవారి శేష వస్త్రాలు, చిత్రపటాలను బహూకరించారు. అనంతరం ఆలయం వెలుపల పీసీసీ అధ్యక్షుడు మీడియాతో మాట్లాడుతూ తాను కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, గోపాల నవీన్‌రాజు, శ్రీనివాస్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఊకల్ ఆలయంలో పీసీసీ అధ్యక్షుడి వెంట మంత్రి పొన్నం, ఎమ్మెల్యేలతో పాటు పార్టీ గీసుగొండ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, అధికార ప్రతినిధులు చాడా కొమురారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య, కందకట్ల కళావతి, హైకోర్టు అడ్వకేట్ తీగల రాజేష్‌గౌడ్, ఏసీపీ తిరుపతి, సీఐ నాగరాజు, ఆలయ కమిటీ చైర్మన్ బాబురావు, కొత్తగట్టు రాజేందర్, నాయకులు కూసం రమేష్, కందకట్ల నరహరి, నాగరాజు, మాజీ సర్పంచ్ నాగదేవత, వీరారావు తదితరులు పాల్గొన్నారు.


టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు భద్రకాళి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేస్తున్న ఈవో, అర్చకులు


ఊకల్ నాగేంద్రస్వామి ఆలయంలో మహేష్‌కుమార్‌గౌడ్, పొన్నంకు ప్రసాదం అందిస్తున్న అర్చకులు సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు

పీసీసీ చీఫ్‌కు ఘన స్వాగతం

టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా హనుమకొండకు వచ్చిన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు మడికొండలో ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు తదితరులతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. నిరసన అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్న భోజనం చేశారు. అక్కడి నుంచి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సమ్మిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు జమ్మికుంటకు బయలుదేరారు.


వైద్య కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



ప్రారంభానికి సిద్ధమైన నర్సంపేట వైద్య కళాశాల భవనం

నేడు నర్సంపేట వైద్య కళాశాల ప్రారంభోత్సవం

హాజరవనున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నర్సంపేట, సెప్టెంబరు 18: వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణ శివారులో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల భవనాన్ని గురువారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధికారులు, వైద్యులతో కలిసి బుధవారం పరిశీలించారు. వైద్య కళాశాల భవనంలో ఏర్పాట్లను, వివిధ విభాగాలకు చెందిన గదులను వారు పరిశీలించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరెడ్డి, కలెక్టర్ సత్యశారద అధికారులకు సూచించారు. మెడికల్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం 50మంది ఎంబీబీఎస్ విద్యార్థులు చేరడానికి ఇండియన్ మెడికల్ కౌన్సిల్ అనుమతిచ్చింది. ఇప్పటి వరకు 50 మందిలో ఏడుగురు నాన్ లోకల్ విద్యార్థులకు అడ్మిషన్లు పొందే అవకాశం కల్పించగా, నాన్ లోకల్‌కు చెందిన ఒక విద్యార్థి మాత్రమే అడ్మిషన్ పొందారు. మరో ఆరుగురు నాన్ లోకల్, 43 మంది లోకల్ విద్యార్థులు అడ్మిషన్లు పొందాల్సి ఉంది. ఈనెల చివరి వరకు అడ్మిషన్లు పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

జర్నలిస్టు హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కన్వీనర్‌గా వల్లాల రమణ



బాలసముద్రం, సెప్టెంబరు 18: జర్నలిస్టు హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కన్వీనర్‌గా వల్లాల రమణను బుధవారం ఐజేయూ అనుబంధ సంఘం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ ప్రకటించారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన వల్లాల రమణ.. మూడు దశాబ్దాలకు పైగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నారు. జర్నలిస్టు సంఘంలో గతంలో ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులుగా, సంయుక్త కార్యదర్శిగా, నాలుగుసార్లు ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా రమణ పని చేశారు. ప్రస్తుతం రమణ మన తెలంగాణ దిన పత్రికా ప్రత్యేక ప్రతినిధిగా కొనసాగుతున్నారు. కాగా, తనను రాష్ట్ర కన్వీనర్‌గా నియమించడం పట్ల మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రాంనారాయణ, ఇతర యూనియన్ నాయకులకు రమణ కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానని పేర్కొన్నారు. యూనియన్ నాయకుల సహకారంతో జర్నలిస్టుల హౌసింగ్ సంక్షేమానికి పాటుపడుతానని అన్నారు. కాగా, ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన రమణకు వివిధ సంఘాల నాయకులు, సీనియర్ జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకులపై ఇన్‌చార్జ్ వీసీ కరుణ సీరియస్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: కేయూ తెలుగు విభాగంలో ఆర్ట్స్ డీన్, విభాగాధిపతి ప్రొఫెసర్ ఏటూరు జ్యోతిని అవమానకరంగా మాట్లాడటంతో పాటు మానసికంగా ఇబ్బందులకు గురిచేసిన తెలుగు విభాగం కాంట్రాక్టు అధ్యాపకుడు కర్రె సదాశివ్‌తో పాటు మరో కాంట్రాక్టు అధ్యాపకుడిపై కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రొఫెసర్ జ్యోతి ఫిర్యాదు మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ కాంట్రాక్టు అధ్యాపకుల సస్పెన్షన్‌కే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా, సదరు కాంట్రాక్టు అధ్యాపకులు ప్రొఫెసర్ ఏటూరు జ్యోతికి క్షమాపణలు చెప్పడంతో పాటు మరోసారి ఎలాంటి తప్పిదాలకు పాల్పడమని లేఖ రాసిచ్చారు.

జర్మనీలో ఉద్యోగాలకు దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18: జర్మనీ దేశంలో వివిధ రంగాల్లోని ఉద్యోగాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఎప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం. మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెని లిమిటెడ్ (టామ్‌కాం) ఆధ్వర్యంలో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. లాజిస్టిక్స్ టెక్నికల్, హాస్పిటాలిటీ, ఫుడ్ టెక్నాలజీ తదితర రంగాల్లో ఉద్యోగాల ఉన్నాయని, 28 సంవత్సరాల వయస్సులోపు గల వారు టామ్‌కామ్ వెబ్‌పోర్టల్ లేదా యాప్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. అన్ని వివరాల కోసం టామ్‌కామ్ వెబ్‌పోర్టల్‌ను లేదా 8125251408/9100798204లో సంప్రదించాలని సూచించారు.

చరిత్ర ఘనం.. శిథిల జ్ఞాపకం..

ములుగు మండలం కొత్తూరు దేవునిగుట్టపై పురాతన ఆలయం
1500ఏళ్లనాటిదిగా భావిస్తున్న పురావస్తు పరిశోధకులు
'ఫారెస్టు' టూరిజానికి మొదటి అడుగు
రాళ్లతో మెట్ల మార్గాన్ని నిర్మిస్తున్న అటవీశాఖ
ట్రెక్కింగ్, క్యాంప్ ఫైర్ నిర్వహణకు సన్నాహాలు


ఆలయాన్ని పరిశీలిస్తున్న జర్మనీ పరిశోధకురాలు కొరీనా (ఫైల్)

ములుగు, సెప్టెంబరు 18: ములుగు అభయారణ్య గర్భం వందల ఏళ్ల చరిత్రను పదిలంగా దాచుకుంది. ఎక్కడ తడిమి చూసినా.. తవ్వి శోధించినా అడుగడుగునా విస్తుగొలిపే వింతలు, విశేషాలే కనిపిస్తాయి. ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపుతో కీర్తిపొందిన రామప్ప దేవాలయం కంటే పురాతనమైన చరిత్ర సాక్ష్యాలు అనేకం శిథిల జ్ఞాపకాలుగా ఉన్నాయి. తాడ్వాయి మండలంలోని దామెరవాయి, మంగపేట మండలంలోని మల్లూరు అడవుల్లో వెలుగుచూసిన డోల్మన్ సమాధులు ఆదిమ మానవుడి ఆనవాళ్లకు దారి చూపిస్తాయి. ఇదే తరహాలో అత్యంత విశిష్టమైన రాతి నిర్మాణమొకటి ములుగు మండలం కొత్తూరు సమీపంలోని దేవునిగుట్టపై ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ దేవాలయంగా ప్రసిద్ధిగాంచిన కంబోడియాలోని అంగ్‌కోర్ వాట్ నిర్మాణ శైలిలో ఉండే ఈ ఆలయం ప్రస్తుతం శిథిలావస్థలో దర్శనమిస్తోంది. నాలుగు దశాబ్దాలుగా ఈ కట్టడంపై విస్తృత పరిశోధనలు జరుగుతుండగా పరిరక్షణ, పునరుద్ధరణకు అడుగులు ముందుకు సాగడంలేదు. తాజాగా అటవీశాఖ ఆధ్వర్యంలో గుట్టపైకి మెట్ల మార్గాన్ని నిర్మిస్తుండటం ఈ ఆలయ మనుగడపై ఆశలు పెంచుతోంది.

ఆరో శతాబ్దం నాటి నిర్మాణం..

ములుగు జిల్లాకేంద్రానికి 18కిలోమీటర్ల దూరంలోని కొత్తూరు గ్రామ శివారులోగల దేవునిగుట్టపై ఈ రాతి నిర్మాణం ఉంది. వందేళ్లక్రితమే ఈ ఆలయం వెలుగులోకి వచ్చినా చుట్టూ ఉన్న దట్టమైన అడవిలో క్రూరమృగాల సంచారం ఎక్కువగా ఉండటంతో ప్రజలెవరూ అటువైపునకు వెళ్లేవారు కాదు. అయితే గత మూడు దశాబ్దాలుగా దీనిపై విస్తృత చర్చ జరుగుతోంది. గత పదేళ్ల కాలంలో దేశ విదేశాలకు చెందిన పురావస్తు, చరిత్ర పరిశోధకులు వచ్చివెళ్లారు. చూసిన వారంతా ఒకింత సంభ్రమాశ్చర్యానికి లోనయ్యారు.


స్థానికులతో కలిసి ఆలయాన్ని సందర్శించిన బ్రిటన్‌కు చెందిన చరిత్రకారుడు ఆడమ్ హార్డీ

అంగ్‌కోర్ వాట్ ఆలయం నమూనాలో ఉండటాన్ని గుర్తించి.. 6, 7శతాబ్దాల కాలంలో నిర్మించి ఉంటారని, విష్ణుకుండినుల కాలంలోని శైలిని పోలి ఉందని అభిప్రాయపడ్డారు. దక్షిణ ఆసియాలోని పురాతన కట్టడాలపై పరిశోధన చేస్తున్న బ్రిటన్‌కు చెందిన చరిత్రకారుడు ఆడమ్ హార్డీ, జర్మనీకి చెందిన కొరీనా, ఇటలీకి చెందిన ఆండ్రీతోపాటు దేశీయ పరిశోధకులు అనేకమంది దేవునిగుట్ట ఆలయాన్ని సందర్శించి చరిత్ర లోతుల్లో అన్వేషించారు. యావత్ భారత దేశంలోనే ఇలాంటి నిర్మాణం ఎక్కడాలేదని తేల్చిచెప్పారు. ఫొటోలు, వీడియోలు తీసుకొని వెళ్లి ఇంకా అధ్యయనం జరుపుతూనే ఉన్నారు.

శిథిలావస్థలో ఆలయం

దేవునిగుట్ట ఆలయం నిర్మాణం చూడగానే మనసును కట్టి పడేస్తుంది. ఆ శైలి ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతోంది. 30మీటర్ల ఎత్తులో ఉండే ఈ ఆలయం రాతి ఇటుకలను పేర్చినట్లు కనిపిస్తుంది. శైవం, వైష్ణవం కలబోతగా శిల్పాకృతులున్నాయి. తాండవం చేస్తున్నట్లుగా పరమశివుడు, నిలువెత్తు విష్ణుమూర్తి, దేవతల ఆకృతులు కనిపిస్తాయి. అనేక రాళ్లపై దేవతామూర్తుల రూపాన్ని చెక్కి వరుసక్రమంలో పేర్చిన తీరు ఆనాటి మేధస్సుకు అద్దం పడుతోంది. కాలక్రమంలో ఆలయం శిథిలావస్థకు చేరగా.. గోపురం పైభాగం ధ్వంసమై వర్షపునీరు లోపలికి చేరుతోంది. చెట్లు పెరగడం, తీగలు అల్లుకోవడంతో రాళ్లమధ్య పగుళ్లు వచ్చాయి. 60 నుంచి 70ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రహరీ ధ్వంసమైంది. ఆలయానికి వెళ్లే మార్గంలో గండశిలపై ఉన్న కోనేరు కాలాలతో సంబంధం లేకుండా ఎప్పుడూ నీటితో నిండి ఉంటుంది. ఇదిలా ఉంటే గుప్తనిధుల కోసం ఇక్కడ అన్వేషణ సాగుతోంది. గతంలో అనేక మంది రహస్యంగా తవ్వకాలు జరిపినట్లు స్థానికులు చెబుతారు. అయితే ఇటీవల ఆలయానికి సందర్శకులు వస్తుండటం, జనసంచారం పెరుగుతుండటంతో కొంతమేరకు తగ్గుముఖం పట్టినట్టు స్పష్టమవుతోంది.

సంరక్షిస్తున్న స్థానికులు

కొత్తూరు గ్రామస్థుల ఆరాధ్య దైవమైన లక్ష్మీనర్సింహస్వామి తమను ప్రకృతి విపత్తులు, వైపరీత్యాల నుంచి కాపాడుతున్నాడని నమ్ముతున్నారు. దేవునిగుట్టపై సాక్షాత్తు నర్సింహస్వామియే కొలువున్నాడనే విశ్వాసంతో వారు 2012లో దేవుని విగ్రహాన్ని ప్రతిష్ఠించుకొని ఏటా హోలీ సమ యంలో వేడుకలు జరుపుతూ లక్ష్మీనర్సింహస్వామికి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు తరలివచ్చి దేవున్ని దర్శించుకుంటారు. ఈక్రమంలో భక్తులు వింత ఆచారాన్ని పాటిస్తున్నారు. వర్షాలు కురవాలని, అంటువ్యాధులు దూరం కావాలని వేడుకుంటూ వరదపాశం వేడుక నిర్వహిస్తున్నారు. బెల్లం, బియ్యం, పాలతో వండిన పరమాన్నాన్ని ఆలయం ఎదుట బండరా యిపై పోసి నాకుతారు. ఇలా ఇన్నేళ్లుగా కొత్తూరువాసులు ఈ పురాతన కట్టడాన్ని సంరక్షిస్తున్నారు. గుడి వద్దకు వెళ్లాలంటే కాలినడకన దట్టమైన తుప్పలు, చెట్లను దాటాలి. ప్రతీ ఏటా ఉత్సవాల సమయంలో అప్పటికప్పుడు ముళ్లపొదలు, తుప్పలను కొంతమేరకు తొలగించి తాత్కాలిక దారిని ఏర్పాటు చేసుకుంటారు.

రూ.10లక్షలతో మెట్లు, బెంచీలు..

ఆలయ పునరుద్ధరణ కోసం రెండేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ కృష్ణఆదిత్య రూ.1.80కోట్లను కేటాయించారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు, తెలంగాణ పురావస్తు శాఖ సంయుక్త పర్యవేక్షణలో పనులు చేయాలని నిర్ణయించారు. అయితే ఆ ప్రయత్నం టెండర్ల దశలోనే నిలిచిపోయింది. తాజాగా జిల్లా అటవీశాఖ అడుగు ముందుకు వేసింది. బొగత, లక్నవరం, తరహాలో దేవునిగుట్టను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సంకల్పించింది. దారి, సదుపాయాల కల్పనకోసం రూ.10లక్షల వ్యయంతో పనులు మొదలుపెట్టారు. 2కిలోమీటర్ల మేర మెట్ల మార్గాన్ని నిర్మిస్తున్నారు. స్థానికంగా లభించే రాళ్లతోనే మెట్లను కడుతున్నారు. గుట్టపై పగోడాలు, సందర్శకులు సేదతీరేందుకు బెంచీలను ఏర్పాటు చేయనున్నట్లు ములుగు ఫారెస్టు రేంజ్ అధికారి శంకర్ తెలిపారు. వారాంతాల్లో ట్రెక్కింగ్, క్యాంప్ ఫైర్, తదితర సదుపాయాలు కూడా కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. దేవునిగుట్ట విశేషాలను పర్యాటకులకు తెలిపేందుకు గైడ్‌ను నియమిస్తామని తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత నిర్ణీత టిక్కెట్ ధరతో సందర్శనకు అనుమతించనున్నట్లు పేర్కొన్నారు.


మెట్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

బీజేపీ, బీఆర్ఎస్ ఐడీయాలజీ ఒక్కటే

గంగారం (కొత్తగూడ), సెప్టెంబరు18 : బీజేపీ రాహుల్‌గాంధీని, బీఆర్ఎస్ రాజీవ్‌గాంధీని టార్గెట్ చేసుకుని రాజకీయాలు చేస్తున్నాయని, ఆ రెండు పార్టీలది ఒకే ఐడీయాలజీ అని, విధ్వంసాలు సృష్టించడం శాంతిభద్రతలను ఆగం చేయడమే వాటి లక్ష్యమని పంచాయితీరాజ్ శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. రాహుల్‌గాంధీని హత్యచేస్తామని బీజేపీ ఎమ్మెల్యే దుర్మార్గమైన వ్యాఖ్యలు చేయడం ఏమిటని, పదేళ్లపాలనలో అసెంబ్లీలో తెలంగాణ తల్లి విగ్రహం ఎందుకు పెట్టలేదని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. బుధవారం గంగారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ప్రజల కోసం ప్రాణాలు త్యాగాలు చేశాడన్నారు. కానీ, బీఆర్ఎస్ రాజీవ్‌గాంధీ విగ్రహం తొలగిస్తామనడం సిగ్గుచేటన్నారు. ఇందిరాగాంధీని హత్యచేసినట్టుగా రాహుల్‌గాంధీని హత్య చేస్తామని హర్యాణా రాష్ట్రంలోని బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం దుర్మార్గమని విమర్శించారు. ఐటీడీఏ కార్యాలయాలను కాంగ్రెస్ పాలనలో ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీ బలరాంనాయక్, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా నారాయణరెడ్డి, గంగారం, కొత్తగూడ మండలాల అధ్యక్షులు జాడి వెంకటేశ్వర్లు, వజ్జ సారయ్య, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, మాజీ జడ్పీటీసీలు ఈసం రమ, పుల్సం పుష్పలత, మాజీ ఎంపీపీలు సువర్ణపాక సరోజన జగ్గారావు, బానోత్ విజయ రూప్‌సింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మల్లిగూడెంలో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సీతక్క

ఏజెన్సీ మండలాల అభివృద్ధే లక్ష్యం..

ఏజెన్సీ మండలాల అభివృద్ధే లక్ష్యంగా నిధులు తీసుకువచ్చి గ్రామాలలో రోడ్లు, వంతెనలు నిర్మిస్తున్నామని, అందరికి సంక్షేమ పథకాలు అందజేస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. గంగారం మండలంలో ఆమె పర్యటించారు. ప్రజలు బతుకమ్మలు, పూలమాలలతో సీతక్కకు స్వాగతం పలికారు, బర్లగుంపు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు సీమంతాలు చేశారు. మండలంలో రూ. 40 కోట్ల నిధులతో మంజూరైన రోడ్లు, వంతెనల నిర్మాణాలకుఎంపీ బలరాంనాయక్‌తో కలిసి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గంగారం మండలంలో సుమారు రూ.40 కోట్లతో రోడ్లు, వంతెనల నిర్మాణాలను ప్రారంభిస్తున్నామన్నారు. కాగా, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు వినతులు మంత్రి సీతక్క అందజేశారు. నీతి అయోగ్ మండల ప్రత్యేకాధికారి శ్రీనాథ్, ఎంపీడీవో అప్పారావు, పంచాయతీ రాజ్ ఈఈ విద్యాసాగర్, డీఈ రాజలింగం, ఏఈ యశ్వంత్, మాజీ జడ్పీటీసీ ఈసం రమ, మాజీ ఎంపీపీ సువర్ణపాక సరోజన జగ్గారావు పాల్గొన్నారు.

దొరవారివేంపల్లిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతా..

● కొత్తగూడ : దొరవారివేంపల్లి గ్రామస్థులు మొత్తంగా ఓట్లువేసి తనను గెలిపించినందుకు గ్రామాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని మంత్రి సీతక్క పేర్కొన్నారు. గ్రామంలోని సమస్యలను తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి తమ గ్రామానికి రావటంలేదని, సమస్యలను పట్టించుకోవటంలేదని గ్రామస్థులు మంత్రికి ఫిర్యాదు చేశారు. వీధిదీపాలు అమర్చుతలేరన్నారు. చెత్తను తొలగించే కార్యక్రమాలు చేపడుతలేరని వివరించారు. సమస్యను డీపీవోకు పంపించి, విచారణ చేపడుతానని సీతక్క తెలిపారు. ఎంపీడీవో రవీంద్రప్రసాద్ విషయాన్ని వివరించి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దొరవారివేంపల్లి నుంచి కర్లెగండి వరకు రోడ్డు నిర్మాణం చేపడుతామన్నారు. దొరవారివేంపల్లి వరకు బీటీ పనులు చేస్తామన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలను పరిశీలించారు. ఉపాధ్యాయుడు కృష్ణ విద్యార్థులకు పాఠాలు నేర్పించే విధానాన్ని చూసి కొనియాడారు. కృష్ణను మంత్రి సీతక్క సన్మానించారు.

వరద నష్టంపై మరోసారి సర్వే చేయాలి

● పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క

మహబూబాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వరద ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి, మరొకసారి సర్వేచేపట్టి పూర్తి వివరాలతో నివేదికను సిద్ధం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, తీసుకున్న చర్యలు, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై బుధవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన బాధితుల కోసం అధికారులు అంకిత భావంతో పనిచేసి వారికి మనోధైర్యం కల్పించాలని కోరారు. దెబ్బతిన్న 15 ఆర్అండ్‌బీ రోడ్లు, జాతీయ రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టి అవసరం ఉన్నచోట వంతెనల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయార్ చేయా లన్నారు. మహబూబాబాద్ జిల్లాలో 136 చెరువులకు నష్టం వాటిల్లిందని అందులో కొన్నింటికి మరమ్మత్తులు చేశారని, మిగిన చెరువుల పనులువెంటనే పూర్తి చేయాలన్నారు. 2196 విద్యుత్ పోళ్లు విరిగిపోగా అందులో 1400 స్తంభాలు నూతనంగా ఏర్పాటు చేయడం జరిగిందని, నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యవసాయం, ఉద్యానవనం పంటల నష్టం వివరాలు సేకరించి నివేదిక సిద్ధం చేయాలన్నారు. వరద ప్రాంతాల్లో ఇప్పటి వరకు 1160 వైద్యశిబిరాలు నిర్వహించి, 19,724 ఫీవర్ సర్వే నిర్వహించి, గుర్తించామని, వెంటనే వారికి కావాల్సిన మందులు పంపిణీ చేసి వైద్యసేవలందించడం జరిగిందని అన్నారు.

కమిటీలతో నష్టం జరగకుండా చర్యలు..

ముందస్తు కమిటీలు వేసుకుని వరదల నుంచి ఎలా బయట పడాలో (ఫ్లడ్ మ్యాప్ బుక్) సిద్ధం చేసుకోవాలని అధికారులను కోరారు. తద్వారా వరదల ప్రభావం నుంచి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. సీతారాంనాయకతండా, వావిలాల్లో సర్వేలు నిర్వహించాలన్నారు. వరదలతో నష్టపోయిన బాధితులకు స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగసంఘాలు, జిల్లాయంత్రాగం, పోలీస్ యంత్రాగం చేసినసేవలు మరువలేనివని అభినందించారు. కొత్తగూడ, గంగారం మండలాల్లో ప్రజల సౌకర్యార్థం సెల్ ఫోన్ టవర్లు నిర్మించడం జరిగిందని, అందుకు సంబంధించిన సిగ్నల్స్ గూర్చి చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న ఏడు గ్రామాల్లో విద్యుత్, తాగునీరు, రోడ్ల మరమ్మత్తులు, శానిటేషన్, వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. బ్యాంకర్లు ప్రత్యేక సమావేశం నిర్వహించి రైతులకు ఇబ్బందులు కలుగకుండా రుణాలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్‌కేకన్, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, అధికారులు పాల్గొన్నారు.



గార్లలో వేలంలో దక్కించుకున్న లడ్డూను ముస్లింలకు అందచేస్తున్న నిర్వాకులు

గణేష్ లడ్డూను దక్కించుకున్న ముస్లింలు

కేసముద్రం, సెప్టెంబరు 18 : కేసముద్రం విలేజీ గణి యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను ఇదే గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు బుధవారం రాత్రి నిర్వహించిన వేలంలో రూ.14,200 లకు దక్కించుకోవడం విశేషం. గ్రామానికి చెందిన షేక్‌నాగుల్ మీరా ఆయన సోదరుడు యాకూబ్ పాష, కుమారుడు ఆజాద్‌పాష పేరిట లడ్డూవేలాన్ని పాడి తీసుకున్నట్లు నాగుల్ మీరా పేర్కొన్నారు. తన చిన్ననాటి నుంచి గణేష్ ఉత్సవాల్లో క్రియాశీలకంగా పాల్గొంటున్నానని తెలిపారు.

గార్లలో రూ.లక్షా 30 వేలకు కైవసం..

● గార్ల : మండల కేంద్రంలోని వర్తక సంఘం భవనంలోని గణేష్ విగ్రహం వద్ద ఉన్న లడ్డూను ఫ్రెండ్స్ గ్రూపులోని ముస్లిం సభ్యులు రూ.లక్షా 30 వేలకు వేలంపాట ద్వారా లడ్డును కైవసం చేసుకున్నారు. ఈ లడ్డును గ్రూపులోని ముస్లిం సోదరులు కలిసికట్టుగా లడ్డును కైవసం చేసుకోవాలనే పట్టుదలతో వేలం పాల్గొన్నారు. దీంతో ఉత్సవ కమిటీ సభ్యులు లడ్డును బుధవారం ముస్లిం సోదరులకు అందజేశారు. రహీం, అఫ్జల్, యాకుబ్ పాష, సర్వర్, జాన్‌ఖాన్, కట్ట రమేష్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుల గడువుపెంపు

● జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18 : జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, లోకల్‌బాడీ, ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) దరఖాస్తుల గడువును ఈ నెల 25 వరకు పొడగించినట్లు డీఈవో రాజేశ్వర్ బుధవారం తెలిపారు. ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు దరఖాస్తు చేసుకోని విద్యార్థినీ, విద్యార్థులచే దరఖాస్తు చేయించాలని ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలకు సూచించారు. ఇతర వివరాలకు ఏసీజీఈ మండుల శ్రీరాములు సెల్ నెంబర్ : 98497 61012ను సంప్రదించలన్నారు.

ప్లాస్టిక్ వద్దు.. వెదురు ఉత్పత్తులు ముద్దు

● జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి మరియన్న

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 18 : ప్లాస్టిక్ వాడకాన్ని బంద్ పెట్టి వెదురు ఉత్పత్తులు వాడుకుని పర్యావరణాన్ని పరిరక్షిం చుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న సూచించారు. కలెక్టరేట్‌లోని ఉద్యానవన శాఖ కార్యాలయంలో బుధవారంప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెదురుతో చేసిన బుట్టలు, ఇతర ఉత్పత్తులను మరియన్నతో పాటు సిబ్బంది, వ్యవసాయ సహాయ సంచాలకుడు (టెక్నికల్) మురళి, మరిపెడ వ్యవసాయ సంచాలకుడు వి.విజయచంద్ర ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెదురు పేదవాడి కలప అని, పచ్చబంగారంగా కొనియాడుతారని చెప్పారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వెయ్యి రకాల పరికరాలు తయారు చేసుకోవచ్చని, దానిద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. వెదురు బొంగులను పందిరగా ఉపయోగించి కూరగాయల సాగు చేసుకోవచ్చని, వెదురుసాగుతో భూతాపాన్ని (గ్లోబల్ వార్మింగ్) కారణమైన కార్బం డక్సైడ్‌ను వాతావరణం నుంచి తొలగించుకుని తద్వారా మేలైన పర్యావరణాన్ని పరిస్థితులను కాపాడుకోవచ్చని చెప్పారు. వెదురు బొంగులతో సహజ సిద్ధమైన కంచెను పెంచుకుని పంటలకు రక్షణగా చేసుకోవచ్చునని, తద్వార ఆదాయం పెంపొందించుకోవచ్చని సూచించారు. వ్యవసాయాధికారి, సూపరింటెండెంట్ ఆర్.శ్రీనివాస రావు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.



వెదురుతో తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న మరియన్న, అధికారులు

బీమా పరిహారం చెక్కు అందజేత

కేసముద్రం, సెప్టెంబరు 18 : మండలంలోని ఉప్పరపల్లిలో గాలి వెంకటేశ్వర్లు రెండేళ్ల క్రితం మృతి చెందగా ఆయనకు ఓ ప్రైవేటు సంస్థకు చెందిన బీమా పరిహారం రూ.6,10,500ల చెక్కును మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, ఎస్ఐ మురళీధర్‌రాజ్ బుధవారం మృతుని కుటుంబానికి అందజేశారు. సదరు కంపెనీలో బీమా పాలసీలో చేరి మృతి చెందడంతో ఈ పరిహారం అందించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, కంపెనీ ప్రతినిధులు సురేష్, వినయ్, సంతోష్, శరత్, మంజుల, అల్లి రమేష్, శాగంటి రాములు, సంతోష్, లావణ్య పాల్గొన్నారు.

రైస్‌మిల్లుతో రైతులు నష్టపోతున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు

కేసముద్రం, సెప్టెంబరు 18 : కేసముద్రం విలేజిలోని ఓంసాయి ఆగ్రోటెక్ నుంచి దుమ్ముదూళి వెలువడుతూ రైతులు నష్టపోతున్నారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు మండలంలోని భూక్యరాంతండాకు చెందిన రైతు వాంకుడోత్ వెంకన్న బుధవారం ఫిర్యాదు చేశారు. మిల్లు చుట్టుపక్కల ఉన్న పంటపొలాల్లో మిల్లు నుంచి వెలువడే దుమ్ము, దూళి పడుతుండడంతో పంటల దిగుబడి తగ్గి రైతులు నష్టపోతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రైతులకు నష్టం వాటిల్లేలా చేస్తున్న సదరు మిల్లును సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వంటసామగ్రి పంపిణీ

నెల్లికుదురు, సెప్టెంబర్ 18 : రావిరాల వరద బాధితులకు లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో బుధవారం వంటసామగ్రి అందజేశారు. 130 మంది వరద బాధితులకు బకెట్లు, వంట గిన్నెలు గ్లాసులు ప్లేట్లు అందజేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కుందూరు వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్, సుధకర్‌రెడ్డి, లక్ష్మీనర్సిహరావు, శారద, రేపూరి రమణారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థిని పట్ల వార్డెన్ అసభ్యకర ప్రవర్తన



విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వార్డెన్‌ను చితకబాదుతున్న పేరెంట్లు, బంధువులు

● దేహశుద్ధి చేసిన బాలిక తల్లిదండ్రులు, బంధువులు

● మానుకోట పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఘటన

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18 : ఓ హాస్టల్ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వార్డెన్‌ను ఆమె తల్లిదండ్రులు, బంధువులు చితకబాదిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగింది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని అదే పాఠశాల హాస్టల్‌లో ఉంటోంది. అయితే హాస్టల్‌లో విద్యార్థినుల బాగోగులు చూసుకోవాల్సిన వార్డెన్ సదరు బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించగా ఆమె విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు తమ బంధువులతో కలిసి బుధవారం పాఠశాలకు చేరుకుని వార్డెన్‌కు దేహశుద్ధి చేశారు. వెంటనే వార్డెన్‌ను విధుల నుంచి తొల గించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పాఠశాల డైరెక్టర్‌ను వివరణ కోరగా నెల క్రితం వార్డెన్‌ను విధుల్లోకి తీసుకున్నామని, విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన అతడిని విధుల నుంచి తొలగించామన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



వినాయక శోభాయాత్ర దృశ్యం

మరిపెడ, సెప్టెంబరు 18 : మునిసిపల్ కేంద్రంలోని ఆర్ఎస్ ప్లాజా రెసిడెన్సీ దగ్గర ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని అంగరంగ వైభవంగా కోలాట నృత్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి, మాకులచెరువులో బుధవారం రాత్రి నిమజ్జనం చేశారు. నిర్వాహకులు కేరళ, వేములవాడ నుంచి వాయిద్యా కళాకారులను రప్పించి మరిపెడ పురవీధుల్లో వినాయక విగ్రహాన్ని మహిళల కోలాట నృత్యాల నడుమ ఊరేగించారు. టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. రేసు సత్తిరెడ్డి-సునీత, విసారపు శ్రీపాల్‌రెడ్డి-ప్రగతి దంపతులతో పాటు నిర్వాహకులు కరణాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కొంపెల్లి సురేందర్‌రెడ్డి, సురేష్, వెంకన్న, గండి సత్యనారాయణ, కే.విష్ణువర్ధన్, పాలబిందెల సోమయ్య, ఉల్లి శ్రీనివాస్, సాగర్, దోమల శ్రీను, నవీన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ నూతన కమిటీ ఎన్నిక

చిన్నగూడూరు, సెప్టెంబరు 18 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నకున్నారు. మండల అధ్యక్షుడిగా సతీష్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగారాచకొండ ఉపేందర్, అసోసియేట్ అధ్యక్షుడిగా అంజయ్య, ఉపాధ్యక్షురాలిగా శ్రావణి, కార్యదర్శిగా వీరస్వామి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు బద్రీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేష్, కరుణాకర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సక్సెస్ చేయాలి

● ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథి

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 18 : సెప్టెంబరు 28న నిర్వహించే ఏఐటీయూసీ జిల్లా శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన కరపత్రాలను ఆవిష్కరించి, మాట్లాడారు. కార్మికుల పక్షాన పోరాటం చేస్తూ 1920 అక్టోబరు 31న మొట్టమొదటి సారిగా ఏర్పడిన సంఘం ఏఐటీయూసీ అన్నారు. నాటి నుంచి నేటివరకు కార్మికుల హక్కుల కోసం, చట్టాల కోసం సాధన కోసం పోరాడుతుందన్నారు. ఈ నెల 29న తొర్రూరు లయన్స్ క్లబ్‌లో నిర్వహించే శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి సీతామహలక్ష్మి, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్ సారథి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఓమ భిక్షపతి, సీపీఐ మండల కార్యదర్శి బందు మహేందర్, గూడెల్లి ఎల్లయ్య, అనిల్ పాల్గొన్నారు.

ఎడ్విన్‌రావు కుటుంబానికి రెడ్యా పరామర్శ

డోర్నకల్, సెప్టెంబరు 18 : సీఎస్ఐ డోర్నకల్ డయాసిస్ మాజీ ట్రెజరర్ ముల్కు ఎడ్విన్‌రావు ఈనెల 10న వృద్ధాప్యంలో వచ్చిన అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్. రెడ్యానాయక్ బుధవారం డోర్నకల్ చర్చికాంపౌండ్‌లోని ఎడ్విన్‌రావు ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. తనకు ఎడ్విన్‌రావుతో 35 ఏళ్లుగా వ్యక్తిగతంగా మంచి పరిచయాలు ఉన్నాయని గుర్తు చేశారు. కుటుంబసభ్యులకు అండగాఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట మహబూబాబాద్ ఏఎంసీ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, డోర్నకల్ పీఏసీఎస్ చైర్మన్ బిక్షంరెడ్డి, వార్డు కౌన్సిలర్ బోరగళ్ల శరత్‌బాబు, మాజీ సర్పంచులు రాయల వెంకటేశ్వర్లు, పాండునాయక్, రాంబాబు, లక్ష్మణ్ ఉన్నారు.

సిగ్నల్ తండాలో వైద్యశిబిరం

డోర్నకల్, సెప్టెంబరు 18 : మునిసిపల్‌పరిధిలోని సిగ్నల్‌తండాలో కొద్దిరోజులుగా విషజ్వరాలు ప్రబలుతుండడంతో బుధవారం తండాలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుమారు 70 మందికి ఉచితంగా వైద్యం అందించి మందులను పంపిణీ చేశారు. జ్వరంతో బాధపడుతున్న వారు వెంటనే చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రి వచ్చి వైద్యపరీక్షలు చేయించుకోవాలని సిబ్బంది శోభన సూచించారు. తండాలో వైద్యశిబిరం ఏర్పాటు చేయడం పట్ల తండ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

బైక్ మెకానిక్ షాపులో దొంగతనం

● రూ.2 లక్షల నగదు, 2 తులాల బంగారం అపహరణ

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 18 : మునిసిపల్ కేంద్రంలోని ఓబైక్ మెకానిక్ షాపులో దొంగతనం జరిగినట్లు బాధితులు గోనే మహేష్-దివ్య దంపతులు వెల్లడించారు. కంఠాయపాలెం గ్రామానికి చెందిన వీరు గత కొన్ని సంవత్సరాలుగా తొర్రూరు ఆంధ్రా బ్యాంకు సమీపంలో బైక్ మెకానిక్ షాపు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో సెప్టెంబరు 15న స్వగ్రామంలో వినాయక నిమజ్జనం వేడుకల వెళ్లి బుధవారం ఉదయం వచ్చారు. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంటి వెనుకాల తలుపులు తీసి ఉండటంతో అనుమానంతో బీరువాను తెరిచి ఉండగా, అందులోఉన్న రూ.2లక్షల నగదు, 2తులాల బంగారం, 20తులాల వెండి కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ బృందాలో వివరాలు సేకరిస్తున్నారు. ఎస్సై ఉపేందర్‌ను వివరణ కోరగా, బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపడుతున్నామని వెల్లడించారు.

బీజేపీ నేతల దిష్టిబొమ్మ దహనం



తొర్రూరులో బీజేపీ నేతల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 18 : ప్రధాన ప్రతిపక్ష నేతరాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు చేసిన వాఖ్యలకు నిరసనగా బుధవారం బీజేపీ నేతల దిష్టి బొమ్మను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ సెంటర్‌లో దహనం చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ముసుగులో బీజేపీ నేతలు మాజీ ఎమ్మెల్యేలు విద్వేషపూరితంగా మాట్లాడుతూ అనుచిత వాఖ్యలకు పాల్పడుతున్నారని, రాహుల్ జోలికి వస్తే ఉనికి లేకుండా చేస్తామని హెచ్చరించారు. మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, సురేందర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, కందాడి అచ్చిరెడ్డి, మేరుగు మల్లేశం, పాడ్యా రమేష్, నాయకులు పాల్గొన్నారు.

●పెద్దవంగర : రాహుల్‌గాంధీని దేశంలో నెం.1 తీవ్రవాది అంటూ, మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి పట్టిన గతే పడుతుందంటూ హెచ్చరించినందుకుగాను పెద్దవంగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తొర్రూరు-హైదరాబాద్ రహదారిపై బీజేపీ నేతల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు రంగు మురళి, రవీందర్ రెడ్డి, బానోతు గోపాల్, పాలకుర్తి దేవస్థాన కమిటీ డైరెక్టర్ వేణు, సీతారాం, రాంబాబు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాటిక

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 18 : జిల్లా కేంద్రంలో ప్రజానాట్య మండలి (పీఎన్ఎం) కళాకారులు వేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాటిక ప్రదర్శన అందరికి ఆకట్టుకుంది. కళాకారులు కళ్లకు కట్టినట్లు నాటికను ప్రదర్శించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఐద్వా పట్టణాధ్యక్షురాలు సూర్నపు సావిత్రమ్మ సంతాపసభ అనంతరం పీఎన్ఎం కళాకారులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాటికను ప్రదర్శించారు. ఇందులో దొరలు, రజకారుల ఆకృత్యాలను ఎదురించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ పోరాట పటిమను ప్రదర్శించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటాలను నాటికలో ప్రదర్శించారు. కళ్లకు కట్టినట్లుగా దాదాపు గంట పాటు ప్రదర్శించిన నాటిక అందరిని ఆకట్టుకుంది.

ముగిసిన దస్ లక్షన్ పర్వ్



డోర్నకల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న జైన మతస్తులు

డోర్నకల్, సెప్టెంబరు 18 : జైన మతగురువు శ్రీఆదినాథ్ మహవీర్ భగవాన్ మానవాళి ఉత్తమ జీవనానికి సూచించిన దస్ లక్షన్ పర్వ్(పది సూత్రాలు) బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా డోర్నకల్ జైనమందిరం నుంచి పది రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేసిన వారిని వాహనంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా జైనసమాజ్ పెద్దలు మహేందర్‌జైన్, పదం కుమార్‌జైన్, సుశీల్‌జైన్‌లు మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక జీవనంలో మహవీర్ బోధనలు పాటిస్తే మనిషి పరిపూర్ణమైన జీవితాన్ని పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోదర్‌జైన్, రవీందర్‌జైన్, డాక్టర్ జితేందర్‌జైన్, ప్రఫుల్‌జైన్, నరేష్‌జైన్, అశోక్‌జైన్, మౌనికజైన్, భారతిజైన్, మమతజైన్, జ్యోతిజైన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలి

● టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం

గూడూరు, సెప్టెంబరు 18 : నూతన జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా రాష్ట్రప్రభుత్వం చేయదలిచిన మార్పులపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ గూడూరు మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల సందర్శన, సమస్యల సేకరణలో భాగంగా బొద్దుగొండ, కొల్లాపురం, అప్పరాజుపల్లి, దామెరవంచ, నాయకపల్లి, తీగలవేణి, బొల్లెపల్లి, అయోధ్యపురం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో శ్రీశైలం మాట్లాడారు. ఇప్పటి వరకు అమలవుతున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల, జూనియర్ కళాశాలల విధానాన్ని సమూలంగా మార్పేక్రమంలో ఎదురవుతున్న అన్నిరకాల సమస్యలను అన్ని కోణాల్లో ఆలోచించాలన్నారు. సోమ విష్ణువర్ధన్, మహబూబ్‌అలీ, సోమ రవి, ఆదినారాయణ, ఉదయ్‌కిరణ్, కార్తీక్ పాల్గొన్నారు.

పాకాల నుంచి లిఫ్ట్ పనుల సర్వే షురూ

కొత్తగూడ, సెప్టెంబరు 18 : పాకాల నుంచి కోనాపురం వరకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తరలించేందుకు చేపట్టే పనుల ప్రణాళిక రుపొందించేందుకు ఇంజనీరింగ్ అధికారులు బుధవారం డీజీపీఎస్ సర్వే మొదలుపెట్టారు. మండలంలోని గ్రామాలకు రెండుపంటలకు నీరందిస్తానని సీతక్క ఇచ్చిన హామీలో భాగంగా అధికారులు సర్వే చేపట్టినట్టు కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కర్ర జనార్ధన్‌రెడ్డి తెలిపారు. పాకాల, ఎంచగూడ, సాధిరెడ్డిపల్లి మీదుగా లిఫ్ట్‌ద్వారా నీటిని కోనాపురం చెరువులో నింపి, అక్కడి నుంచి మిగతా గ్రామాలకు సాగు నీరందించనున్నారు. సర్వేలో డీఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ అనూష, సిబ్బంది హరికుమార్, సాంబయ్య, నరేష్, సంతోష్, గ్రామస్తులు కుంజ బిక్షపతి, మెతుకు సంజీవరెడ్డి పాల్గొన్నారు.



కోనాపురంలో సర్వే చేస్తున్న అధికారులు